క్లుప్తంగా

ముగిసిన సరిగెత్తు వేడుకలు



తెల్లవారు జామున స్వామి వారి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

పాములపాడు: మండల కేంద్రంలో రెండు రోజులుగా జరుగుతున్న మౌలాలిస్వామి సరిగెత్తు వేడుకలు శనివారంతో ముగిశాయి. ఈ నెల 8న సాయంత్రం ఊరేగింపు మొదలై శనివారం తెల్లవారు జాము వరకు సాగింది. అనంతరం స్వామి పీరును చావిడీలో ఉంచారు. అంతకు మునుపు గ్రామంలో భక్తులు కందుర్లు, పూల షేరాలు, దట్టీలతో మొక్కుబడులు చెల్లించుకున్నారు. మరి కొందరు స్వామి వారికి వెండి గొడుగులు, ఊయలలను సమర్పించారు.

మహానందీశ్వరుడికి వైభవంగా ఆరుద్రోత్సవ పూజలు



మహానందిలో రుద్రహోమం చేపడుతున్న పండితులు

మహానంది: శ్రావణమాసం ఆరుద్రనక్షత్రం సందర్భంగా మహానందిలో కొలువైన శ్రీమహానందీశ్వరస్వామివారికి లక్ష బిల్వార్చన, 121 రుద్రాలతో మహన్యాసపూర్వక రుద్రాభిషేకం శనివారం వైభవంగా నిర్వహించారు. ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన సుబ్బారావు, భక్త బృందం దాతలుగా వ్యవహరించారు. ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, శాంతారామ్ భట్, నారాయణ శర్మ, తదితర ఋత్వికులు శాస్త్రోక్తంగా పూజలు చేపట్టారు. నవ నందుల్లో ఒకటైన మహానందిలోని వినాయక నందీశ్వర స్వామికి పంచామృతం , వివిధ పండ్ల రసాలతో అభిషేకం చేశారు.

మహానందిలో వీకెండ్ సందడి



క్యూలైన్లో వేచివున్న భక్తులు

మహానంది: శ్రావణమాసం వీకెండ్‌కావడంతో మహానంది ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు వేలాది సంఖ్యలో తరలివచ్చారు. ఆలయం నుంచి వచ్చిన భక్తులు శ్రీకామేశ్వరిదేవి సహిత మహానందీశ్వరస్వామివార్లను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమైన స్వామిఅమ్మవార్ల దర్శనం రాత్రి వరకు నిర్విరామంగా కొనసాగింది. వివిధ ఆర్జిత సేవల ద్వారా ఆలయానికి సుమారు రూ.7 లక్షలకు పైగా ఆదాయం సమకూరింది.

అన్నదానానికి దాతలు ముందుకు రావాలి



గర్భిణులకు అన్నం వడ్డిస్తున్న దృశ్యం

నందికొట్కూరు: వైద్య పరీక్షల కోసం వచ్చే గర్భణుల ఆకలి తీర్చేందుకు దాతలు ముందుకు రావాలని జవ్వాజి సుంకన్న గౌడ్ సేవా సమితి అధ్యక్షులు శ్రీకాంత్ అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో జవ్వాజి సువకన్న గౌడ్ సేవా సమితి ఆధ్వర్యంలో పరీక్ష కోసం వచ్చిన గర్భిణులకు సాయి రాం విద్యాసంస్థల అధినేత సుధాకర్‌రెడ్డి కుమారుడు పుట్టిన రోజు సందర్భంగా అన్నదానం చేశారు. అయన మాట్లాడుతూ అన్నదానం చేసే వారికి ఎంతో పుణ్యం వస్తుందన్నారు. ప్రతి నెల 9వ తేదిన వైద్య పరీక్షల కోసం వచ్చే గర్భవతులకు బలమైన ఆహారం అందించే దాతలు గొప్ప మనసున్నవారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆర్ట్ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

జీ 20 మాక్ సమావేశం

వెలుగోడు: ప్రస్తుతం దేశంలో జరుగుతున్న జీ 20 దేశాల సమావేశంపై స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాక్ సమావేశం నిర్వహించారు. 10వ తరగతి విద్యార్థులు వివిధ దేశాల జాతీయ పతాకాలను స్వయంగా తయారు చేసి జీ 20 దేశాల అధ్యక్షుల పేర్లతో అనుకరించారు. సామాన్యునికి అర్థమయ్యే విధంగా సమావేశ ఇతివత్తాన్ని కళ్లకు కట్టినట్లుగా వివరించారు. విద్యార్థులు వివిధ దేశాల అధ్యక్షుల స్థానాలలో ఆసీనులై ద్వైపాక్షిక ఒప్పందాలు, చంద్రయాన్ -3 విజయవంత విషయాలు, డిజిటల్ ఇండియా, మేక్ ఇండియా తదితర విషయాలపై దేశం సాధించిన ప్రగతిని, భారత్ జీడీపీ గురించి విద్యార్థులు చక్కగా వివరించారు. కార్యక్రమానికి హెచ్‌ఎం సత్యనారాయణ రావు అధ్యక్షత వహించారు. సైన్సు ఉపాధ్యాయుడు వెంకట సుబ్బయ్య విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవిశంకర్‌రావు, మొయినుద్దీన్, ఫైజుల్లా, సురేంద్ర సింగ్, నరసింహులు, విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

యువతకు శిక్షణ పేరుతో ప్రజాధనం లూటీ

- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్
- పూర్తి ఆధారాలతోనే చంద్రబాబు అరెస్టు
- స్కాంలో అరెస్టు చేస్తే ధర్నాలు చేయడం సిగ్గుచేటు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

నందికొట్కూరు: యువతకు శిక్షణ పేరుతో చంద్రబాబు నాయుడు ప్రజాధనం లూటీ చేయడం ఎంత వరకు సమంజసమని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ ప్రశ్నించారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. స్కిల్ డెవలప్‌మెంట్ పేరిట స్కాంలో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడును అరెస్టు చేస్తే ఆ పార్టీ నాయకులు ధర్నాలు చేయడం సిగ్గుచేటన్నారు. అప్పటి కేబినెట్‌ను తప్పుదారి పట్టించి ఆమెదం పొందిన తర్వాత ఒప్పందంలో మరోకటి పెట్టి ప్రజాధనం కాజేయడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. రూ.371 కోట్ల ప్రజాధనం ఎవరెవరి బ్యాంకు ఖాతాలో జమ చేశారో టీడీపీ నేత సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇన్నాళ్లు తప్పించుకున్నారు, ఇప్పుడు శిక్షకు సమయం ఆసన్నమైందని చెప్పారు. పూర్తి ఆధారలతోనే చంద్రబాబును అరెస్టు చేశారని గుర్తు చేశారు. స్కిల్ మోసంతో పాటు ఐటీ మోసానికి పాల్పడ్డారని చంద్రబాబును అరెస్టు చేస్తే రాజకీయం చేయడం సబబు కాదన్నారు. ఈ స్కాంపై జీఎస్టీ, ఇంటిలిజెన్స్, ఐటీ, ఈడీ, సెబీ ఏజెన్సీలన్నీ దర్యాప్తు చేసింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. 2014లో అధికారం చేపట్టిన రెండు నెలలోనే చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో దోచేసిన డబ్బులు విదేశాలకు పంపి 70కి పైగా షెల్ కంపెనీల ద్వారా చేతులు మారి మళ్లీ తిరిగి దేశంలో వచ్చాయని ఆరోపించారు. తప్పుడు జీఓలతో ప్రజాధనం దోపిడీ చేసిన బాబుకు చివరకు శిక్ష తప్ప లేదన్నారు. డబ్బులను హవాలా మార్గంలో తరలించినట్లు 2017లోనే బయటపడిందని చెప్పారు.

టీడీపీ ధర్నాకు స్పందన కరువు

టీడీపీ నేత చంద్రబాబు అరెస్టుకు నిరసనగా పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ బస్టాండ్, ప్రధాన రహదారిపై నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జ్ మాండ్ర శివానందరెడ్డి ఆధ్వర్యంలో బంద్, రాస్తారోకో కార్యక్రమం నిర్వహించారు. అయితే టీడీపీ ఇచ్చిన బంద్‌కు తెలుగు తమ్ముళ్లు, ప్రజల నుంచి పెద్దగా స్పందన కన్పించలేదు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడే అవినీతి కుంభకోణంలో ఇరుక్కుపోవడంతో టీడీపీ నేతలు ఆందోళన చేసేందుకు ముఖం చాటేశారు. దీంతో తూతూ మంత్రంగా ధర్నా కొనసాగింది. కొద్దిసేపు కార్యక్రమం నిర్వహించి వెళ్లిపోయారు. 12 గంటలకే రోడ్డుపైకి బస్సులు వచ్చేశాయి.

చట్టం తన పని తాను చేసుకుంటూ వెళ్తుంది

- చంద్రబాబు తప్పు చేశారు కాబట్టే అరెస్టు
- వైఎస్సార్‌సీపీపై నింద వేయడం సరికాదు
- వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వరరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న భువనేశ్వరరెడ్డి

ఆత్మకూరు: చట్టం తనపని తాను చేసుకుంటూ వెళ్తుందని, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తప్పు చేశారు కాబట్టే అరెస్టు చేశారని వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ సీనియర్ నాయకుడు శిల్పా భువనేశ్వరరెడ్డి అన్నారు. ఆయనను అరెస్ట్ చేయడంపై టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ పై నింద వేయడం సరికాదన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. స్కిల్‌డెవలప్‌మెంట్ పథకంలో రూ.370 కోట్ల స్కామ్ చేడయం వల్లనే చంద్రబాబును అరెస్ట్ చేశారని, అది పార్టీకి సంబంధించిన విషయం కాదన్నారు. స్కిల్‌డెవలప్‌మెంట్ పేరుతో 90 శాతం గ్రాంట్ చేసి రూ.370 కోట్లు రిలీజ్ చేసి డ్రా చేస్తే ఆర్థక శాఖ అధికారులు ఈ నిధులు దేని కోసమని నోట్ చేశారని చెప్పారు. అయితే ఒత్తిడి చేసి నిధులు డ్రా చేశారని, వీటికి సంబంధించిన ఫైనాన్స్ వివరాల్లో జరిగిన అవకతవకలను ఏసీబీ పూర్తి స్థాయిలో విచారించి చంద్రబాబును అరెస్ట్ చేయడం జరిగిందే తప్పా, తమ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా అరెస్ట్ చేయలేదన్నారు. చట్టం తనపని తాము చేసుకుంటూ పోతుందని, చంద్రబాబు తప్పు చేశారు కాబట్టే అరెస్టు చేశారని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవినీతికి తావు లేకుండా పరిపాలనా చేస్తున్నారని, ప్రజాభిమానం వైఎస్సార్‌సీపీ వెంట ఉందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ తిరుపాలమ్మ, పార్టీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్‌మీర్, జెడ్పీటీసీ కురుకుంద శంకర్‌రెడ్డి, విజయచౌదరి, విజయ్, పువ్వాడ భాస్కర్, వెంకటస్వామి గౌడ్, బైరాపురం మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి



బ్రాహ్మణకొట్కూరు పీహెచ్‌సీలో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ వెంకటరమణ

నందికొట్కూరు రూరల్ : గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ వెంకటరమణ వైద్యాధికారులను ఆదేశించారు. శనివారం మండల పరిధిలోని బ్రాహ్మణ కొట్కూరు పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అయన మాట్లాడుతూ పీహెచ్‌సీలో వైద్యులు నిత్యం అందుబాటులో ఉండాలని సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం వైద్యశాలలో రికార్డులను పరిశీలించి వ్యాక్సినేషన్, ఫ్యామిలీ డాక్టర్ గురించి వైద్యులు సుబ్రహ్మణ్యంను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్సులు సునీత, గీతా, హెల్త్ ఎడ్యుకేటర్ ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో బోర్ల తవ్వకం

పాములపాడు: మండలంలోని మద్దూరు గ్రామపంచాయతీలో ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ సహకరాంతో బోర్లు తవ్వించామని సర్పంచు మొల్ల అఖ్తరున్నిసా తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ మద్దూరు గ్రామంలో 2, మజరా క్రిష్టానగర్ గ్రామంలో 2 చొప్పున బోర్లు వేయించడం జరిగిందన్నారు. ప్రతి సంవత్సరం వేసవి కాలంలో నీటి సమస్య తలెత్తుతుందన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారన్నారు. సమస్య ఎక్కువగా ఉన్న కాలనీల్లో బోర్లు వేయించాలని ఆదేశించారని చెప్పారు. బోర్లలో నీరు పుష్కలంగా పడ్డాయని, ఇక గ్రామంలో నీటి సమస్య ఉండబోదని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జబ్బార్, శ్రీనివాసులు గౌడు తదితరులు పాల్గొన్నారు.

బంద్‌తో ప్రయాణికుల ఇబ్బందులు



ఆత్మకూరు ఆర్టీసీ బస్టాండ్‌లో పడిగాపులుగాస్తున్న ప్రయాణికులు

ఆత్మకూరు: నంద్యాల పట్టణంలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ను పోలీసులు అరెస్ట్ చేసిన నేపథ్యంలో టీడీపీ కార్యకర్తలు బంద్ చేపట్టడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం ఆర్టీసీ బస్సులు ఆత్మకూరులో నిలిచిపోవడంతో శ్రీశైలం, కర్నూలు, నంద్యాల, విజయవాడ, హైదరాబాద్ లాంటి ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. బస్సులు ఆయా డిపోలకే పరిమితం కావడంతో ప్రయాణికులు శ్రీశైలం, దోర్నాల , కర్నూలు నంద్యాల, నందికొట్కూరు ప్రాంతాలకు వెళ్లేందుకు ఆటోలను ఆశ్రయించారు. ఆటోలు ఆత్మకూరు నుంచి కర్నూలుకు రూ 120, నందికొట్కూరుకు రూ.60 చొప్పున వసూలు చేశారు. ఇతర ప్రాంతాలకు కూడా అధిక చార్జీలు తీసుకోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

కర్నూలు వెళ్లేందుకు ఇబ్బంది పడ్డాం



ఉదయం కర్నూలు వెళ్లాలని ఆత్మకూరు బస్టాండ్‌కు వెళ్లాను. బస్టాండ్‌లో బస్సులు బంద్ అని తెలిసింది. చంద్రబాబును అరెస్ట్ చేశారని, బస్సులు నిలిపివేశారని చెప్పడంతో ఇబ్బందులు పడ్డాం. చంద్రబాబును అరెస్ట్ చేసిందుకు బంద్‌కు పిలుపునిస్తే ప్రయాణికులు ఇబ్బంది పడతారని అర్థం చేసుకోవాలి. ఆటో వారు అధిక చార్జీలు వసూలు చేశారు. తప్పనిపరిస్థితుల్లో ఆటోలోనే కర్నూలు వెళ్లే పరిస్థితి ఏర్పడింది.

– దరగమ్మ, ఆత్మకూరు

చట్టం దృష్టిలో అందరూ సమానమే



చట్టం తన పనితాను చేస్తుంది. చట్టం దృష్టిలో అందరు సమానమే చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట్‌లో అవినీతికి పాల్పడినందుకు అరెస్ట్ చేశారే తప్ప ఉద్దేశపూర్వకంగా కాదు. ఏ నేత అయినా తప్పులు జరిగినప్పుడు పోలీసులకు సహకరించాలి. ప్రతి పార్టీలో క్రమశిక్షణకు కట్టుబడి ఉండాలి. చంద్రబాబు అరెస్టులో వైఎస్సార్‌సీపీ ప్రమేయం లేదు. అధికారులు చట్టానికి లోబడి విధులు నిర్వహిస్తున్నారు. – సయ్యద్‌మీర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఆత్మకూరు

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం



లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న ఆత్మకూరు సీనియర్ సివిల్‌జడ్జి వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న నందికొట్కూరు సీనియర్ సివిల్‌జడ్జి ఇందిరా ప్రియదర్శిని

ఆత్మకూరు/ఆత్మకూరు రూరల్: పట్టణంలోని కోర్టులో శనివారం జరిగిన లోక్ అదాలత్ కార్యక్రమంలో 479 కేసులు పరిష్కారమైనట్లు సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర రావు, జూనియర్ సివిల్ జడ్జి పి.తేజసాయి అన్నా రు. వారు మాట్లాడుతూ లోక్‌అదాలత్ ద్వారా క్రిమినల్ కేసులు 146, సివిల్ కేసులు 17 కేసులు, యూ నియన్ బ్యాంక్ ఆత్మకూరు బ్రాంచ్ 5, సెల్‌ఫోన్ డిపార్ట్‌మెంట్ 1 కేసు, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు కేసులు 310 పరిష్కారమైనట్లు చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాబు రాజేంద్రప్రసాద్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ సుధాకర్ రెడ్డి, మెంబర్ మాణిక్యరావు పాల్గొన్నారు.

429 కేసుల పరిష్కారం

నందికొట్కూరు: నేషనల్ మెగా లోక అదాలత్‌లో రాజీ మార్గంలో 429 కేసులు పరిష్కరించినట్లు సీనియర్ సివిల్ జడ్జి ఇందిరా ప్రియదర్శిని, జూనియర్ సివిల్ జడ్జి పవన్‌కుమార్ తెలిపారు. శనివారం పట్టణంలోని కోర్టు ఆవరణలో నేషనల్ మెగా లోక అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అందరి సహకారంతో 429 కేసులు పరిష్కారం చేయడం జరిగిందన్నారు. అప్పుల కేసులు, ఆస్తి తగాదాలు, చెక్‌బౌన్స్, క్రిమినల్ కేసులు రాజీ చేసినట్లు వెల్లడించారు. అప్పులకు సంబంధించి రూ, 27, 73, 207 రాజీ మార్గంలో బాధితులకు ఇప్పించినట్లు చెప్పారు.

నిప్పులవాగుకు 1,070 క్యూసెక్కుల నీరు

జూపాడుబంగ్లా: లాకిన్స్‌లా నుంచి నిప్పులవాగుకు రూ.1,070క్యూసెక్కుల సాగునీటిని విడుదల చేస్తున్నట్లు కేసీ కాల్వ ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సుంకేసుల డ్యాం నుంచి కేసీ కాల్వకు 1,600 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తుండగా రైతుల వినియోగం అనంతరం 1,420 క్యూసెక్కులు లాకిన్స్‌లాకు చేరుతున్నట్లు తెలిపారు. ఈ నీటిని లాకిన్స్‌లా నుంచి తూడిచెర్ల సబ్‌ఛానల్ కాల్వకు 250 క్యూసెక్కులు, ఏబీఆర్ కాల్వకు 100 క్యూసెక్కులు, నిప్పులవాగుకు 1,070 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నట్లు ఏఈ వివరించారు. రైతులు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు.

12 నుంచి మండల స్థాయి క్రీడాపోటీలు

మిడుతూరు: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 12వ తేదీ నుంచి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల హెచ్‌ఎం సాయి తిమ్మయ్య, క్రీడా సమన్వయకర్త ఫిజికల్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ 12న అండర్ -4 విభాగం బాలబాలికలకు, 13న అండర్ -17 విభాగం బాల బాలికలకు బాడ్మింటన్/షటిల్, బాల్‌బాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో, టెన్నికాయిట్, త్రో బాల్, వాలీబాల్, యోగా, అథ్లెటిక్స్ పోటీలు ఉంటాయన్నారు. విద్యార్థులు వయస్సు ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని కోరారు.

ఉపాధి పనుల్లో అవినీతి రూ.61,911



పీడీ రామచంద్రారెడ్డి అధ్వర్యంలో గ్రామ సభ నిర్వహిస్తున్న అధికారులు

జూపాడుబంగ్లా: మండలంలోని 12 గ్రామపంచాయతీల్లో 2022 ఏప్రిల్ నుంచి మార్చి 2023 వరకు రూ.6.09 కోట్లతో చేపట్టిన ఉపాధి పనుల్లో రూ.61,911ల అవినీతి, అక్రమాలు గుర్తించినట్లు పీడీ రామచంద్రారెడ్డి తెలిపారు. శనివారం జూపాడుబంగ్లా ఉపాధిహామీ పథకం కార్యాలయం వద్ద 17వ విడత సామాజిక తనిఖీ బహిరంగ సభను నిర్వహించారు. సామాజిక తనిఖీ బృందం సభ్యులు సేకరించిన సమగ్ర వివరాలను పీడీ రామచంద్రారెడ్డి, అదనపు పీడీ సలీంబాషా, అసిస్టెంటు విజిలెన్స్ అధికారి బాలాజీనాయక్, క్వాలిటీకంట్రోల్ అధికారి గంగాధర్, ఏపీడీ అన్వరాబేగం అధ్వర్యంలో డీఆర్పీలు చదివి వినిపించారు. సామాజిక తనిఖీ బృందం వెల్లడించిన వివరాల మేరకు రూ.43,411లు వివిధ గ్రామాలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లు, టీఏలు, సీఓల నుంచి రికవరీ చేయాలని పీడీ ఆదేశించారు. అలాగే 18,500లను పెనాల్టీగా విధించినట్లు తెలిపారు. రూ.4,26,523లకు చెందిన పనుల విషయమై రెక్టిఫికేషన్ చేసుకోవాలని, రూ.3,90,694 మొత్తాన్ని రీప్లాంటేషన్ కింద పరిగణించి అందుకు బాధ్యులైన వారికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తామన్నారు. నోటీసులు జారీచేసిన 15రోజుల్లోగా సరైన సంజాయిషీ ఇవ్వకపోతే ఈ మొత్తాన్ని రికవరీ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుబ్రమణ్యశర్మ, ఏపీఓ గౌరీబాయి, ఎంపీపీ సువర్ణమ్మ, వైస్ ఎంపీపీ తోకల కృష్ణారెడ్డి, జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యదర్శి కోసిక తిరుమలేశ్వరరెడ్డి, సర్పంచులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వైద్య సేవలు



చికిత్స చేస్తున్న వైద్యురాలు

పగిద్యాల: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అతిసారం రోగులకు నాల్గవ రోజు శనివారం వైద్య సిబ్బంది సహాయక చర్యలను కొనసాగించారు. కలుషిత నీటి ప్రభావంతో ఆంజనేయనగర్, బీరవోలు, పగిద్యాల గ్రామాల్లో అతిసారం ప్రబలిన విధితమే. నాల్గవ రోజు 13 కేసులు నమోదైనట్లు వైద్యాధికారి మోహన్ వెల్లడించారు. సమాచారం అందుకున్న రాష్ట్ర ఎపిడామాలిజిస్టు వెంకటేశ్వర్లు ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి బాధితులను విచారించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మోహన్ ఆధ్వర్యంలో ఫీల్డ్ స్టాఫ్, ఆశావర్కర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో వైద్యాధికారి మాట్లాడుతూ అతిసారం కేసుల తీవ్రత అదుపులోకి వచ్చిందని అయినా ఆశా వర్కర్లు ఇంటింటి సర్వే చేపట్టి వారికి క్లోరిన్ మాత్రలు, యాంటిబ్యాటిక్ మాత్రలు పంపిణీ చేసి కుటుంబ సభ్యుల ఆరోగ్య వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఏమైనా అతిసారం లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యాధికారి, ఎంపీడీఓ దృష్టికి తీసుకురావాలని కోరారు. పొలాలకు వెళ్లే కూలీలు కూడా ఎక్కడా పడితే అక్కడా మురుగునీరు తాగకుండా మినరల్ వాటర్‌ను వెంట తీసుకెళ్లేలా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కాంతారావు నాయక్, డాక్టర్లు యశస్విని, అనిల్‌కుమార్, సీహెచ్‌ఓ రామగుర్రప్ప తదితరులు ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి



అమ్మవారికి పూజ చేస్తున్న పీఠాధిపతి

కొత్తపల్లి: రాష్ట్రంలో ఏకైక సరస్వతి దేవాలయం కొలనుభారతి ఆలయం అభివృద్ధి విషయాన్ని దేవదాయశాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్తామని కాకనురు శ్రీ శారద పీఠం పీఠాధిపతులు శ్రీ శివయోగేంద్ర సరస్వతి స్వామి తెలిపారు. శనివారం కొత్తపల్లి మండలంలోని శివపురం గ్రామ శివారులో వెలసిన కొలనుభారతి క్షేత్రాన్ని సందర్శించారు. ముందుగా ఆలయ అర్చకులు స్వాగతం పలికి సరస్వతి దేవి ఆలయంలో పలు విశేష పూజలు నిర్వహించారు. అలాగే ఆలయ పరిసర ప్రాంగణంలో ఉన్న సప్త శివాలయాలను తిలకించి విశేష పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏకైక సరస్వతి దేవాలయం ఉండడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమన్నారు. అయితే గత కొన్ని సంవత్సరాల నుంచి కొలను భారతి క్షేత్ర అభివృద్ధి ముందుకు సాగక ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్న చందంగా ఉందన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి కొలను భారతి అమ్మ వారి దర్శనం కోసం వస్తున్న భక్తులకు సరైన సౌకర్యాలు లేవన్నారు.

శ్రీశైలంలో భక్తుల రద్దీ



భక్తులతో కిటకిటలాడుతున్న క్యూ

శ్రీశైలంటెంపుల్: రెండవ శనివారం, వారాంతపు రోజులు, శ్రావణమాసం ముగుస్తుండడంతో శ్రీశైల క్షేత్రానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, తదితర రాష్ట్రాల నుంచి భక్తులు శ్రీశైలం చేరుకున్నారు. వేకువజామునే పాతాళగంగ పుణ్యస్నానాలనంతరం మల్లన్న దర్శనార్థమై ఉచిత, ప్రత్యేక దర్శన క్యూలకు చేరుకున్నారు. దీంతో అన్ని క్యూ కంపార్ట్‌మెంట్లు, క్యూలు భక్తులతో నిండిపోయాయి. భక్తుల సౌకర్యార్థం ఆలయాధికారులు క్యూలలో వేచి ఉన్న భక్తులకు మంచినీరు, అల్పాహారాన్ని ఉచితంగా అందజేశారు.

చెరువులో దూకి మహిళ ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న శ్యామలమ్మ

నందికొట్కూరు రూరల్ : చెరువులో దూకి మహిళ ఆత్మ హత్య చేసుకున్న ఘటన శనివారం నందికొట్కూరు మండలంలోని బ్రాహ్మణకొట్కూరు గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు బ్రాహ్మణకొట్కూరు గ్రామానికి చెందిన శ్యామలమ్మ (48) అనే మహిళ కొంత కాలంగా తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. ఆరోగ్య సమస్యలు ఎంతకూ తగ్గకపోవడంతో జీవితంపై విరక్తి చెంది శనివారం వేకువ జామున 4గంటల సమయంలో గ్రామంలోని చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చెరువువద్దకు వెళ్లి మహిళ మృతదేహాన్ని వెలికి తీశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఓబులేసు తెలిపారు.

'విశ్వకర్మ యోజన'ను సద్వినియోగం చేసుకోండి

నంద్యాల(అర్బన్): చేతి వృత్తుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విశ్వకర్మ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐపీఓ (ఇండస్ట్రీరియల్ ప్రమోటివ్ ఆఫీసర్) చంద్రశేఖర్ తెలిపారు. స్థానిక 15వ వార్డు సచివాలయంలో శనివారం చేతి వృత్తి దారులతో సమావేశం నిర్వహించారు. జేసీఎస్ టౌన్ కన్వీనర్ సన్నల సాయిరాంరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో చంద్రశేఖర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ పథకానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హత సాధించిన వారికి శిక్షణతో పాటు పనిముట్లను ఇస్తారని చెప్పారు.

చెరువులు నిండుగా.. రైతన్నలు ఖుషీగా

- వర్షాలకు చెరువులు, కుంటలు, బావులకు జలకళ
- ఎండుతున్న పైర్లకు జీవం
- కళకళలాడుతున్న పంట పొలాలు



జలకళ సంతరించుకున్న కొత్తపల్లె చెరువు



నిండుగా కనిపిస్తున్న గువ్వలకుంట్ల చెరువు

కొత్తపల్లె: వర్షాలు సమృద్ధిగా కురవడంతో చెరువులు నిండుకుండల్లా కనిపిస్తున్నాయి. కుంటలు, బావులు ప్రస్తుతం జలకళను సంతరించుకున్నాయి. దీంతోపాటు ఎండుతున్న పంటకు జీవం రావడంతో పంట పొలాలు కళకళలాడుతున్నాయి. చెరువులు నిండుగా ఉండడంతో ఖరీఫ్‌కు ఢోకాలేదని రైతన్నలు ఖుషీగా ఉన్నారు.

నిండు కుండలా చెరువులు, కుంటలు

ఆగస్టు నెలలో సరైన వర్షాపాతం లేకపోవడంతో చెరువుల నుంచి రైతులు నీటి వినియోగించుకున్నారు. దీంతో చెరువుల్లో నీటి మట్టం సగానికి తగ్గిపోయింది. అయితే ఈనెల ప్రారంభంలో కురిసిన వానలకు చెరువులు పూర్తిస్థాయిలో నిండాయి. గతనెల 29న 20.4 మి.మీ ఈనెల 3న 16.4 మి.మీలు, 04న 50.8 మి.మీల, 5వ తేదీన 20.4 మి.మీల వర్షపాతం నమోదు అయింది. దీంతో గువ్వలకుంట్ల, కొత్తపల్లె, శివపురం, బావాపురం, ఎదురుపాడు, గోకవరం, సింగరాజుపల్లె, లింగాపురం చెరువులతో పాటు కుంటలు నిండు కుండలా దర్శనమిస్తున్నాయి. మండలంలోని రాయిసెల కాల్వ, వరదరాజస్వామి ప్రాజెక్ట్ కాల్వలు పూర్తి సామర్థ్యంతో ప్రవహిస్తున్నాయి. చెరువులు జలకళ సంతరించుకోవడంతో ఖరీఫ్ సాగుకు ఢోకాలేదని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


2,000 హెక్టార్లలో పంటలు



బండినాయిని పాలెం సమీపంలో పచ్చదనంతో పులకరిస్తున్న వరిపైరు


మండలంలోని చెరువుల కింద 2,000 హెక్టార్లలో రైతులు వరి, మొక్కజొన్న, పత్తి, పెసర వంటి వివిధ రకాల పంటలను సాగు చేసుకున్నారు. మండలంలోని కొన్ని గ్రామాలలో ముందుగా వేసుకున్న మొక్కజొన్న, పత్తి పంటలు వర్షాలులేక దెబ్బతిన్నాయి. రైతులు నీటి కోసం ఎదురు చూస్తున్న తరుణంలో వర్షం పడడంతో రైతన్నలు ఆనందంగా ఉన్నారు. ఎండిపోతాయనుకున్న పంటలు మరలా జీవం పోసుకొని కళకళలాడుతున్నాయి.

పైర్లు కళకళలాడుతున్నాయి..



జూన్ నెలలో తొలకరి వర్షాలు పడటంతో మొక్కజొన్న 13 ఎకరాలు వేశా. ఆగస్టు నెలలో సరైన వర్షాలు లేక వేసిన పంటలు ఎండిపోతాఏమో అన్న సమయంలో వర్షాలు పడడంతో పంటలు కళకళలాడుతున్నాయి. వెసిన పంటలు అన్ని బాగున్నాయి. ఎంతో ఆనందంగా ఉంది. –మునిరంగ, రైతు భట్టువారిపల్లె

పంటలకు పుష్కలంగా నీరు



సకాలంలో వర్షాలు పడడంతో చెరువులు, కుంటలు నిండడంతో వేసుకున్న పంటలకు పుష్కలంగా నీరు లభిస్తుంది. ఖరీఫ్ సాగుకు చెరువుల కింద సాగుచేసుకొన్న పంటలకు ఎప్పుడైన నీరందే విధంగా చెరువులు నిండడం సంతోషానిస్తుంది. ఎడతెరిపిలేని వర్షాలకారణంగా చెరువులు కొద్దిరోజుల్లోనే నిండుకుండలను తలపిస్తున్నాయి. ఖరీఫ్‌సాగుకు భయంలేకుండా పోయింది.

–రాజశేఖర్,రైతు, గువ్వలకుంట్ల